సాక్షి ప్రకాశం

మంగళవారం । 26 । డిసెంబర్ । 2023



సంక్రాంతి కప్ పునఃప్రారంభం

కొరిశపాడు మండలం రావినూతలలో కోవిడ్ కారణంగా మూడేళ్లుగా నిలిచిపోయిన సంక్రాంతి కప్ అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలను పునఃప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. - 8లో..



జాతీయస్థాయి క్రీడా పోటీలకు జిల్లా విద్యార్థులు

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. ఖోఖో, త్రోబాల్ పోటీలకు ఎంపికై అభినందనలు అందుకున్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
29/21

వాతావరణం

దట్టమైన పొగ మంచు ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఒంగోలు వాసుల ప్రతిభ

- జాతీయ తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు



బంగారు, వెండి పతకాలు సాధించిన విద్యార్థులు

ఒంగోలు: 38వ జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఒంగోలు తైక్వాండో అసోసియేషన్ విద్యార్థులు బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు నిర్వహించారు. అండర్–13 బాలుర విభాగంలో నిహాంత్, విజ్ఞాన్, దేవ, దీపక్‌రెడ్డి బంగారు పతకాలు, బాలికల విభాగంలో నిఖితారెడ్డి కాంస్య పతకం సాధించారు. సీనియర్స్ విభాగంలో వంశీకృష్ణ బంగారు, బ్లాక్ బెల్ట్ విభాగంలో షేక్ ఆరిఫ్ బంగారు, ప్రశాంత్ వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం ఒంగోలు చేరుకున్న వారితో పాటు వారికి శిక్షణ ఇచ్చిన అంతర్జాతీయ కోచ్ షేక్ కరిముల్లాను తైక్వాండో జాతీయ అధ్యక్షుడు బీవీ రమణయ్య, అక్కిరెడ్డి, మహబూబ్‌బాషా, షాజహాన్, బొమ్మినేని మురళి అభినందించారు.

వైభవంగా చెన్నకేశవస్వామికి ఉయ్యాల సేవ



ఉయ్యాల సేవలో శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి

మార్కాపురం టౌన్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ముక్కోటి ఏకాదశి పర్వదినం మూడో రోజున శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామికి ఉయ్యాల సేవ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలు శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి యతి రాజా సేవా సంఘం, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వికాస తరంగిణి మహిళల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఈఓ గొలమారి శ్రీనివాసరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గొప్ప వేడుక.. క్రీస్తు పుట్టుక



ఒంగోలులోని పునీత చినథెరేసమ్మ చర్చిలో బాల ఏసు ఆశీసులు పొందుతున్న క్రైస్తవులు



భారీగా పాల్గొన్న క్రైస్తవులు



ఒంగోలు జేఎంబీ చర్చిలో దైవ ప్రసంగం చేస్తున్న పాస్టర్ అగస్టీన్


ఏసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రిస్మస్ వేడుకలను సోమవారం జిల్లావ్యాప్తంగా అట్టహాసంగా నిర్వహించారు. క్రీస్తు పుట్టుకను స్వాగతిస్తూ ఆదివారం అర్ధరాత్రి నుంచే సంబరాలు చేశారు. క్రైస్తవులు భారీగా చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. లోకాన్ని రక్షించేందుకే క్రీస్తు జన్మించారని, ఆయన చూపిన మార్గంలో నడవాలని పాస్టర్లు దైవ సందేశం అందించారు.

– ఒంగోలు టౌన్

దిగులు తీర్చి.. ధీమానిచ్చి..!

ఊహించని విపత్తులు..అనుకోని ప్రమాదాలు నిరుపేదలను కోలుకోలేకుండా చేస్తున్నాయి. కుటుంబానికి ఆసరాగా ఉన్న వ్యక్తి దూరమైతే నిలువ నీడ లేకుండా పోతోంది. అప్పటి వరకూ సాఫీగా సాగుతున్న జీవితం ఒక్కసారిగా తలకిందులవుతోంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా ఇస్తోంది. తక్షణ సాయంగా మట్టి ఖర్చులకు రూ.10 వేలు అందిస్తోంది. సంబంధిత పత్రాలన్నీ సమర్పించిన అనంతరం మరణాన్ని బట్టి రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకూ అందజేస్తోంది. వైఎస్సార్ బీమా పథకం కింద జిల్లాలో గడిచిన 5 నెలల్లో 55 మందికి సంబంధించి రూ. 2.75 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం అందజేసింది.

- ఆపన్నులకు అండగా నిలుస్తున్న వైఎస్సార్ బీమా పథకం
- ప్రమాదంలో మరణించిన వారి కుటుంబానికి రూ.5 లక్షలు
- సహజ మరణం పొందిన వారి కుటుంబానికి రూ.లక్ష
- 5 నెలల్లో 55 మందికి రూ.2.75 కోట్లు అందజేసిన ప్రభుత్వం
- బాధిత కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్న వైనం



మార్కాపురం: నిరుపేద కుటుంబాలకు అనుకోకుండా ప్రమాదం జరిగినప్పుడు ఎవరూ ఆదుకోరేమోనన్న భయాన్ని పోగొడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్ బీమా పథకంతో కష్టకాలంలో పేదలకు ధీమానిస్తున్నారు. తర్వాత 2020 అక్టోబర్ 22వ తేదీ రాష్ట్రంలో వైఎస్సార్ బీమా పథకం ప్రారంభమైంది.తెల్లరేషన్‌కార్డు కలిగిన 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వయసు ప్రజలందరూ వైఎస్సార్ ఈ పథకానికి అర్హులు. ప్రమాదవశాత్తూ మరణించినా, సహజంగా మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా ఈ పథకం ద్వారా బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందుతోంది. ఆ కుటుంబంలో నామినీగా ఉన్న వ్యక్తికి బీమా నగదు అందిస్తారు. ప్రమాదం జరిగి మరణించిన వ్యక్తి కుటుంబానికి రూ.5 లక్షలు, 18 నుంచి 50 సంవత్సరాల్లోపు సహజ మరణం పొందితే రూ.లక్ష ఆర్థికసాయం అందజేస్తారు. తక్షణ సాయంగా మట్టి ఖర్చులకు రూ.10 వేలు ఇస్తారు.

5 నెలల్లో 55 మందికి రూ.2.75 కోట్లు అందజేత...

జిల్లా వ్యాప్తంగా మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు, కనిగిరి, దర్శి, కొండపి, సంతనూతలపాడు, ఒంగోలు నియోజకవర్గాల పరిధిలో వైఎస్సార్ బీమా కింద ఈ ఏడాది జూలై 1 నుంచి డిసెంబరు 4వ తేదీ వరకూ 5 నెలల కాలంలో 514 మంది సహజంగా మరణించారు. 83 మంది ప్రమాదవశాత్తూ మృతిచెందారు. 83 యాక్సిడెంట్ కేసుల్లో 55 మంది కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున 2.75 కోట్ల రూపాయలను నామినీ ఖాతాలకు 30 రోజుల్లోపే రాష్ట్ర ప్రభుత్వం జమ చేసింది. ఆర్థిక భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి అమలుచేస్తున్న ఈ పథకంపై బాధిత కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

లబ్ధిదారుల్లో కొందరు...

- అర్ధవీడు మండలం మోదేపల్లి గ్రామానికి చెందిన కావేరి ఈ ఏడాది సెప్టెంబర్ 16న మరణించగా, ఆమె తల్లి రాజమ్మకు 5 లక్షల రూపాయలను వైఎస్సార్ బీమా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం అందించింది.
- గిద్దలూరు మండలం పొదలకుంట్లపల్లి గ్రామానికి చెందిన జి.కొండారెడ్డి అక్టోబర్ 29న మృతిచెందగా, ఆయన భార్య వరలక్ష్మికి 5 లక్షల రూపాయలు అందింది.
- మార్కాపురం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ నవంబరు 2న మృతిచెందగా, ఆయన భార్య విజయలక్ష్మికి 5 లక్షల రూపాయలు అందించారు.
- ఒంగోలు మున్సిపాలిటీ పరిధిలోని విరాట్‌నగర్‌కు చెందిన పులి వెంకటరెడ్డి అక్టోబర్ 25న మరణించగా, ఆయన భార్య మాధవికి రూ.5 లక్షల బీమా నగదు మంజూరైంది. ఇంకా.. కొత్తపట్నం, మద్దిపాడు మండలాల్లో పలువురికి బీమా పథకం కింద నగదు అందజేశారు.

కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండ



వైఎస్సార్ బీమా పథకం ఆపదలో ఉన్న కుటుంబ సభ్యులకు అండగా ఉంటోంది. మరణించిన వ్యక్తుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండేందుకు ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని అమలుచేస్తోంది. గడిచిన 5 నెలల వ్యవధిలో 55 మందికి 2.75 కోట్ల రూపాయలు అందజేసింది. ఎక్కడా జాప్యం చేయడం లేదు. మట్టి ఖర్చుల కింద తక్షణమే 10 వేల రూపాయలు అందజేస్తున్నాం. అర్హులైన ప్రతిఒక్కరికీ ఈ పథకాన్ని అమలు చేస్తున్నాం. క్లెయిమ్‌ల పరిష్కారంలో జాప్యం లేకుండా చూస్తున్నాం.

– రవికుమార్, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ, ఒంగోలు

వైఎస్సార్ బీమా నగదు అందింది



నాపేరు నూతలపాటి లక్ష్మణ్. నేను పట్టణంలోని 16వ వార్డు బాపూజీ కాలనీలో నివాసం ఉంటాను. మా అమ్మ నూతలపాటి కాంతమ్మ అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మా వార్డు కౌన్సిలర్ హర్షిత వెంటనే సచివాలయానికి సమాచారం అందించి ఇంటికి వచ్చి వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు అందజేశారు. మిగతా డబ్బులు కూడా త్వరలో వస్తాయని చెప్పారు. మంచి పథకం అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు.

– లక్ష్మణ్, మార్కాపురం

జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు



మార్కాపురం మున్సిపాలిటీలోని గాంధీ బజారు సచివాలయం పరిధిలో మేము నివాసం ఉంటున్నాము. మా అమ్మ పోసాని రమణమ్మ నవంబర్ 29వ తేదీ మృతిచెందారు. విషయం తెలుసుకున్న మా వార్డు కౌన్సిలర్ బుశ్శెట్టి నాగేశ్వరరావు సచివాలయ సిబ్బందితో మాట్లాడి వైఎస్సార్ బీమా పథకం వర్తింపజేసి తక్షణమే రూ.10 వేల నగదు మట్టి ఖర్చుల నిమిత్తం అందజేశారు. సీఎంకు ధన్యవాదాలు.

– అనంతలక్ష్మి, మార్కాపురం

లోక రక్షకుడు.. ఏసుక్రీస్తు



నగర మేయర్ గంగాడ సుజాత ఇంటి వద్ద నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

- పాస్టర్ అగస్టీన్
- భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు
- క్రైస్తవులతో కిటకిటలాడిన చర్చిలు

ఒంగోలు టౌన్: ప్రభువు ఏసుక్రీస్తు లోక రక్షకుడని, పాపులను రక్షించేందుకు ఆయన ఈ లోకానికి వచ్చారని పాస్టర్ అగస్టీన్ అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని నగరంలోని జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిలో సోమవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. వేలాదిగా క్రైస్తవులు తరలివచ్చి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ అగస్టీన్ దైవసందేశం అందించారు. దేవుడు లోకానికి వెలుగై వచ్చారని, చీకటిలో ఉన్న మానవుడిని వెలిగించేందుకు తాను త్యాగానికి సిద్ధపడ్డారని చెప్పారు. జీవితంలో నూతనోత్తేజాన్ని కలిగించిన దేవుడు సమస్త ఆనందాలను పంచారని తెలిపారు. ఆ ప్రభువు చూపిన దారిలో మనమంతా నడుద్దామన్నారు. సహాయక పాస్టర్ ఆషిర్ పాల్, చర్చి కమిటీ కార్యదర్శి వై.స్వరరూప్‌కుమార్, కోశాధికారి పి.జెరుష్ రవికుమార్, స్టాండింగ్ కమిటీ సభ్యులు ప్రార్థనలను పర్యవేక్షించారు. పాత కూరగాయల మార్కెట్ వద్ద గల సెయింట్ థెరిసా చర్చి, ఆర్‌సీఎం చర్చిల్లో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారీగా తరలివచ్చిన భక్తులు ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఫాదర్ డీఎఫ్ పాల్, ఫాదర్ మణి ప్రార్థనలు నిర్వహించారు. క్రిస్మస్ సందర్భంగా దివ్యబలి పూజలు సమర్పించారు. అనంతరం బాల ఏసు ప్రతిమను భక్తులు ముద్దాడి తమ భక్తిభావాన్ని చాటుకున్నారు. కబాడిపాలెంలో గల పాస్టర్ భగవాన్‌దాస్ చర్చిలో క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించారు. కిక్కిరిసిన భక్తులతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ భగవాన్ దాస్ క్రిస్మస్ పండుగ విశిష్టత, ఏసు ప్రభువు పుట్టుక గురించి వివరించారు. రైల్వేస్టేషన్ చర్చి, బైపాస్ వద్ద గల చర్చిలో క్రిస్మస్ పండుగను ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహించారు. కల్వరి టెంపుల్‌లో క్రిస్మస్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు నగరంలోని సెవెంత్ డే చర్చి, లూథరన్ చర్చి, ఎక్కోలు ప్రార్థనా మందిరం, కవనెంట్ చర్చిలో క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా ఘనంగా నిర్వహించారు. తూర్పు క్రిస్టియన్ పాలెం, క్లౌ పేట, కబాడిపాలెం, గద్దలగుంట, మామిడిపాలెం, అరవపాలెం, రైల్వే క్వార్టర్స్, బలరాం కాలనీ, సుజాత నగర్‌లోని చర్చిలు, వీధులు విద్యుత్ దీపాలతో కళకళలాడాయి. నక్షత్రాలు నేలకు దిగి వచ్చినట్లు వెలుగులు విరజిమ్మాయి. నక్షత్రాలు, ట్రీలను అలంకరించారు. స్టార్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పండుగను పురస్కరించుకుని బంధుమిత్రులకు క్రైస్తవులు పిండివంటలు, మిఠాయిలు పంచిపెట్టారు. నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా గడిపారు. చిన్నారులకు బహుమతులు అందజేసి పెద్దలు ఆశీర్వదించారు. నగరంలో ఎటుచూసినా పండుగ వాతావరణం కనిపించింది. క్రైస్తవులకు కులమతాలకు అతీతంగా పలువురు శుభాకాంక్షలను చెప్పడం కనిపించింది.

నగర మేయర్ ఇంటి వద్ద క్రిస్మస్ వేడుకలు...

పవిత్ర క్రిస్మస్ పండుగ సందర్భంగా నగర మేయర్ గంగాడ సుజాత స్వగృహం వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్ సీపీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభువు ఏసు ప్రతి ఒక్కరినీ చల్లగా చూడాలని కోరుకున్నారు. నగర ప్రజలకు మేయర గంగాడ సుజాత క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బేతంశెట్టి శైలజ, హరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగేశ్వరరావు, మహిళా విభాగం కార్యదర్శి బైరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై పాశురాలు

- పాల్గొన్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



ఎంపీ మాగుంటను సన్మానిస్తున్న గీతా మందిరం నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: స్థానిక గాంధీరోడ్డులోని గీతామందిరంలో ధనుర్మాస పూజల్లో భాగంగా సోమవారం తిరుప్పావై పాశురాలు తొమ్మిదో రోజు కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి పాల్గొని మందిరంలోని కృష్ణుడు విగ్రహానికి మంగళ హారతులిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణుడి లీలల గురించి మాగుంట వివరించారు. ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు తిరుప్పావై పాశురాల ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. ప్రవచకులు పొన్నూరు శ్రీనివాసులును స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు. అనంతరం గీతామందిరం అధ్యక్షుడు తాతా శ్రీనివాసులు, సూపర్‌బజార్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, తదితరులు ఎంపీ మాగుంటను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గీతామందిరం భక్తబృందం, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి, విశ్రాంత తహసీల్దార్ మూడమంచు వెంకటేశ్వర్లు, సాహితీవేత్త కేఎస్వీ ప్రసాద్, సినీ విమర్శకుడు జానకీరామ్, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కల్లగుంట కృష్ణయ్య, సూర్య స్కూల్ కరస్పాండెంట్ రామాల వేంకట రామిరెడ్డి, బీఎస్ఎన్ఎల్ శ్రీనివాసరావు, ఎఱ్ఱన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, ముస్లిం రచయితల సంఘ అధ్యక్షుడు షేక్ మహబూబ్‌జాన్, విశ్వమానవ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మస్తాన్‌రావు, జి.గురవారెడ్డి, ఓ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పల్నాడు జిల్లా ఎడ్ల సత్తా

- రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీల్లో ప్రథమస్థానం కైవసం



హోరాహోరీగా పోటీ పడుతున్న ఎడ్ల జత

పెద్దారవీడు: పల్నాడు జిల్లా ఎడ్లు సత్తా చాటాయి. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామ సమీపంలోని శ్రీ కాశీనాయన 28వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎడ్ల పోటీల్లో మొదటి స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం పాకలపాడు గ్రామానికి చెందిన రాయపాటి విశ్వేశ్వరరావు, కంచేటి శివ సంయుక్త ఎడ్ల జత 2,702 అడుగుల దూరం బండ లాగి మొదటి స్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం మతకమల్ల గ్రామానికి చెందిన మాంద్రు మల్లయ్య బ్రదర్స్ ఎడ్లజత 2,600 అడుగులు లాగి రెండో స్థానంలో, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామానికి చెందిన పాతిన లక్షిత్‌చౌదరి ఎడ్ల జత 2,574 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. అదేవిధంగా బాపట్ల జిల్లా మార్టూరు పట్టణానికి చెందిన గౌతుకట్ల వెంకటకృష్ణ ఎడ్లజత 2,559 అడుగులు లాగి నాలుగో స్థానంలో, గుంటూరు జిల్లా పత్తిపాడు పట్టణానికి చెందిన పమిడి అంజయ్యచౌదరి ఎడ్ల జత 2,518 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతిగా మార్కాపురం సీఎంఆర్ షాపింగ్‌మాల్ వారు రూ.25,116, రెండో బహుమతిగా గొల్మారి లక్ష్మీరెడ్డి, బట్టగిరి సుబ్బారెడ్డి, కొటపాటి కలిసి రూ.20,116, మూడో బహుమతిగా మార్కాపురం లోచన కంటి, దంత వైద్యశాల యజమానులైన డాక్టర్లు ఫణీంద్రారెడ్డి, శ్వేత రూ.15,116, నాలుగో బహుమతిగా దరిమడుగు గ్రామానికి చెందిన జవ్వాజి కృష్ణారెడ్డి రూ.10,116, ఐదో బహుమతిగా జవ్వాజి లోకనాథరెడ్డి రూ.5,116 నగదును విజేతలకు అందజేశారు. యాంకర్ వెంకటరామిరెడ్డి, న్యాయనిర్ణేతలుగా గొట్టం సూర్యనారాయణరెడ్డి, గుంటక పాపిరెడ్డి, గుంటక సుబ్బారెడ్డి వ్యవహరించారు. మంగళవారం సీనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

క్లుప్తంగా

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, దక్షిణాయనం, మర్గశిరమాసం, రోహిణి నక్షత్రం చతుర్దశి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంటల వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

క్రిస్మస్ ప్రార్థనల్లో ఎమ్మెల్సీ సునీత



చర్చిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సునీత

చీరాల: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పోతుల సునీత పట్టణంలోని పలు చర్చిలలో జరిగిన క్రిస్మస్ ప్రార్థనలలో పాల్గొన్నారు. క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థనలు చేశారు. మనకు ఉన్నదానిలో పేదలకు దానం చేయడమే క్రీస్తుకు మనమిచ్చే కానుకని పేర్కొన్నారు. ఆమె వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పోతుల సురేష్ ఉన్నారు.

ఖురాన్ పఠనంతో ఆధ్యాత్మిక విలువలు



విజేతలతో షంషేర్ ఆలీబేగ్ తదితరులు

మార్కాపురం టౌన్: ఖురాన్‌ను పఠించడం ద్వారా ఆధ్యాత్మిక విలువలు పెరుగుతాయని ఏ1 గ్లోబల్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎం షంషేర్ ఆలీబేగ్ అన్నారు. సోమవారం యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్, జమాతే ఇస్లామీ హింద్ సంయుక్తంగా రాష్ట్ర వ్యాప్త 9వ ఖురాన్ కంఠస్థ పోటీలను పట్టణంలోని చిన్న మసీదు ఆవరణలో నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 200 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా విజేతలకు షంషేర్ ఆలీబేగ్, జిల్లా అధ్యక్షుడు అష్రఫ్ ఆలీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో హఫీజ్ సాధిక్, ఇస్మాయిల్, అయూబ్, అమీన్ ఉమ్రీ, షబ్బీర్, సికిందర్ బాషా, ఖలీబ్, న్యామతుల్లా, ఇస్మాయిల్, ఖాశీంబాషా తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆలయ ఆదాయం రూ.1.57 లక్షలు



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయానికి ఆదివారం రూ.1,56,991 ఆదాయం వచ్చినట్లు ఈవో జి.రమణారెడ్డి సోమవారం తెలిపారు. స్వామివారి దర్శనం టికెట్ల విక్రయంతో రూ.53,870, లడ్డూ ప్రసాదాల విక్రయంతో రూ.22,620, ఆలయం వద్ద నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకం నిర్వహణకు విరాళాలుగా రూ.80,501 ఆదాయం వచ్చినట్లు ఈవో, చైర్మన్ వివరించారు. అన్నదానానికి గుంటూరు జిల్లా నరసారావుపేటకు చెందిన పాలపర్తి లక్ష్మీనారాయణ, వెంగమ్మ దంపతులు రూ.50 వేల విరాళాన్ని ఆలయ ఈవో రమణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో పాలపర్తి నారాయణరావు, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం జమ్మనపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నరాల చెన్నారెడ్డి అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ షేక్ సెహబాజ్ తెలిపారు. నిందితుడి నుంచి 75 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సూరారెడ్డిపాలెంలో యువకుడు అదృశ్యం

టంగుటూరు: టంగుటూరు మండలంలోని సూరారెడ్డిపాలెం గ్రామంలో యువకుడు అదృశ్యమైన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రాచపూడి ఆదిత్య తన కుటుంబ సభ్యులతో గొడవపడి అలిగి బయటకు వెళ్లాడు. గ్రామానికి సమీపంలోని బావిలో దూకుతున్నానని ఫోన్‌లో కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు బావి సమీపంలో పరిశీలించగా సెల్‌ఫోన్, చెప్పులు కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ఖాదర్‌బాషా, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలంలో గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఏసు నామమే జయం..



ఒంగోలు పునీత చినథెరీసమ్మ చర్చిలో బాల ఏసు ఆశీస్సులు పొందుతున్న క్రైస్తవులు

ఏసుక్రీస్తు జన్మదినాన్ని సోమవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. చర్చిలను సుందరంగా ముస్తాబు చేశారు. దేవుని మార్గంలో నడవాలని పాస్టర్లు దైవ సందేశం అందించారు. విశ్వాసులు భక్తి శ్రద్ధలతో ప్రార్థనల్లో పాల్గొన్నారు. పండగ సందర్భంగా పలు చోట్ల పేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

- సాక్షి నెట్‌వర్క్



మార్కాపురం తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చిలో ప్రార్థనకు హాజరైన విశ్వాసులు



పునీత చినథెరీసమ్మ చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్లు





ఒంగోలు జేఎంబీ చర్చిలో క్రిస్మస్ ప్రార్థనలో యువతులు, క్రీస్తు గీతాలు ఆలపిస్తున్న క్వాయర్ బృందం



సింగరాయకొండ తెలుగు బాప్టిస్టు చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో చిన్నారులు



కనిగిరిలో దైవ సందేశాన్ని ఆలకిస్తున్న క్రీస్తు విశ్వాసులు



దర్శిలో ఏసుక్రీస్తును ప్రార్థిస్తున్న మహిళలు, చిన్నారులు



యర్రగొండపాలెం హోసన్న మందిరంలో క్రీస్తు బోధనలు వింటున్న సంఘస్తులు

సంక్రాంతి కప్ పునఃప్రారంభం

- జనవరి 9 నుంచి 16వ తేదీ వరకు పోటీల నిర్వహణ
- లోగో ఆవిష్కరించిన సినీ నటుడు రఘుబాబు
- మొదటి బహుమతి రూ.3 లక్షలు



సంక్రాంతి కప్ లోగో ఆవిష్కరిస్తున్న ప్రముఖ సినీ నటుడు రఘుబాబు, అసోసియేషన్ సభ్యులు

మేదరమెట్ల: కోవిడ్ కారణంగా గత మూడేళ్ల నుంచి నిలిచిన అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీలు మళ్లీ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలోని రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి కప్ పునఃప్రారంభం కానుంది. కోవిడ్ కారణంగా గత మూడేళ్ల నుంచి అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలు నిలిచిపోయిన సంగతి పాఠకులకు తెలిసిందే. కాగా ఈ పోటీలు జనవరి 9వ తేదీ నుంచి 16వ తేదీవరకు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సోమవారం నిర్వహించిన సమావేశంలో తెలియజేశారు. రావినూతల క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ సినీనటుడు యర్రా రఘుబాబు పాల్గొని 30వ అంతర్‌రాష్ట్ర క్రికెట్ పోటీలకు చెందిన సంక్రాంతి కప్ లోగోలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గతంలో మాదిరిగానే ఈపోటీలు 20–20 ఫార్మట్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.3 లక్షలు, రెండో జట్టుకు రూ.2 లక్షలు, మూడో జట్టుకు రూ.1 లక్ష నగదు బహుమతులు అందజేయనున్నట్లు, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, బెస్ట్ ఫీల్డర్‌లకు కూడా బహుమతులు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల్లో పలు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని, పోటీలు నాకౌట్ పద్ధతిలో నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కారుసాల నాగేశ్వరరావు(బాబు) అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, గ్రామస్తులు, క్రికెట్ అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఖోఖో బాలుర జట్టు శిక్షణ పూర్తి

జే.పంగులూరు: రాష్ట్ర ఖోఖో అండర్–18 బాలుర జట్టు శిక్షణ సోమవారం ముగిసింది. పంగులూరు స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో క్రీడా ప్రాంగణంలో ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడెమీ ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి 24వ తేదీ వరకు అండర్–18 విభాగంలో రాష్ట్ర బాలుర జట్టుకు ఖోఖో శిక్షణ జరిగింది. సోమవారం రాష్ట్ర ఖోఖో కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో ఖోఖో శిక్షణ ముగింపు కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా సీతారామిరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని రాయ్‌పూర్ పట్టణంలో నిర్వహించనున్న పోటీల్లో రాష్ట్ర జట్టు పాల్గొంటుందని తెలిపారు. రాష్ట్ర జట్టుకు 24 రోజుల పాటు శిక్షణ సందర్భంగా భోజన సదుపాయం కల్పించిన మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ ఉగ్రనరసింగహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులకు మేకల జయరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు రూ.30 వేల విలువైన క్రీడా దుస్తులు అందించారు. దాతలకు క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. క్రీడాకారులు ప్రతిభ కనపరిచి ప్రథమ స్థానం సాధించాలని గ్రామ పెద్దలు, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ చైర్మన్ బాచిన చెంచు గరటయ్య, జిల్లా అధ్యక్షు, కార్యదర్శులు బి.కాశీవిశ్వనాథరెడ్డి, కె.భాస్కర్‌రావు ఆకాంక్షించారు. బాలుర జట్టుకు కోచ్‌గా కె.పెరిరెడ్డి, మేనేజర్లుగా గణేష్, మహ్మద్ వ్యవహరించనున్నారు.

రాష్ట్ర బాలుర జట్టు

ఎస్.షాలేమ్‌రాజు(ప్రకాశం), సుధీర్‌కుమార్(ప్రకాశం), బి.దిలీప్ కుమార్ (విజయనగరం), షేక్ షబ్బీర్ (విజయనగరం), ఎం. మంత్రు నాయక్ (ప్రకాశం), జి.చిరంజీవి (విశాఖపట్నం), కె.జగదీష్ (కర్నూలు), జి.నాని (ప్రకాశం), పి.గోపి (ప్రకాశం), ఆర్.శశికుమార్ (నెల్లూరు), వి.ప్రజ్ఞమనోహర్ (గుంటూరు), టి.తిమోతి(కృష్ణా), ఎస్.మహేష్‌బాబు (ప్రకాశం), ఎస్.వినోద్ కుమార్(చిత్తూరు), కె.శివశంకర్(తూర్పుగోదావరి).



శిక్షణ పూర్తి చేసుకున్న రాష్ట్ర ఖోఖో జట్టు

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు జిల్లా విద్యార్థులు





జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన కనిగిరి ఎంఎస్ఎం కాలేజీ విద్యార్థినులు, ఎమ్మెస్సార్ కాలేజీ విద్యార్థినులు



దర్శి విద్యార్థిని అభినందిస్తున్న పీడీ అంజిరెడ్డి

కనిగిరి రూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థులు ఎంపికైనట్లు ఖోఖో సంఘ జిల్లా కార్యదర్శి బి.కాశీవిశ్వనాథరెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని తిరువూరు సెంట్రల్ యూనివర్శిటీలో నిర్వహిస్తున్న దక్షిణ భారత విశ్వవిద్యాలయ ఖోఖో పోటీల్లో కనిగిరి ఎంఎస్ఎం(జీసీఅండ్‌వైపీఎస్) కళాశాలకు చెందిన ఎం.దివ్యశ్రీ, ఇ.హేమవతి, బి.శిరీషా, ఎ.అశ్విని, టి.అహల్య, యు.నాగమల్లేశ్వరి ఏఎస్‌యూ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు వివరించారు.

ఎమ్మెస్సార్ కళాశాలకు చెందిన ఎం.సఖియా, బి.సుమతి, బి.శ్రీజ, ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని రాయపూర్‌లో నిర్వహిస్తున్న 42వ జాతీయ స్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో ఏపీ బాలికల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థినులను రాష్ట్ర ఖోఖో సంఘ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి, ఎమ్మెస్సార్ ట్రస్ట్ అడ్వైజర్ డి.కృష్ణారెడ్డి, ఎంఎస్ఎం కళాశాలల అధినేత, కరస్పాండెంట్లు ఏలూరి సుబ్బారావు, ఏలూరి నరేన్ చౌదరి, ప్రిన్సిపాల్ టి.వెంకటరెడ్డి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

త్రోబాల్ పోటీలకు దర్శి విద్యార్థి..

దర్శి: జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు దర్శి విద్యార్థి ఇత్తడి ఆనంద జయకుమార్ ఎంపికైనట్లు చందలూరు జెడ్పీ హైస్కూల్ పీడీ సోము అంజిరెడ్డి సోమవారం తెలిపారు. 9వ తరగతి చదువుతున్న ఆనంద్ ఈనెల 20వ తేదీన విజయవాడ గుణదల మాతా కళాశాలలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని చెప్పారు.

ఈనెల 28 నుంచి 31 వరకు తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. జయకుమార్‌ను పాఠశాల హెచ్ఎం జి.గురుబ్రహ్మం, గురుప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఓవరాల్ చాంపియన్ నెల్లూరు



మహిళల రిలే పరుగు పందెం



పరుగు పందెంలో పురుషులు

ఉలవపాడు: 43వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా నిలిచింది. రామాయపట్నం చర్చి గ్రౌండ్‌లో పోటీలు జరిగాయి. మహిళల 1500 మీటర్ల విభాగంలో 50 ఏళ్ల పైన కె.రత్తమ్మ (నెల్లూరు), పెంచలమ్మ (నెల్లూరు), 55 ఏళ్ల పైన లక్ష్మి (నెల్లూరు), 60 ఏళ్ల పైన కోటేశ్వరమ్మ (నెల్లూరు), 400 మీటర్ల విభాగంలో 30 ఏళ్ల పైన లక్ష్మి (నెల్లూరు), 40 ఏళ్ల పైన రజని వైశాలిని (నెల్లూరు), 50 ఏళ్ల పైన ప్రవీణదేవి (నెల్లూరు), రత్తమ్మ (నెల్లూరు), 55 ఏళ్ల పైన పద్మావతి (నెల్లూరు) విజేతలుగా నిలిచారు. మహిళల రిలే పరుగుపందెంలో నెల్లూరు జట్టు విజయం సాధించింది. 45 ఏళ్ల పైన పురుషుల విభాగంలో 400 మీటర్ల పరుగుపందెం టి.వెంకటేశ్వర్లు(కృష్ణా), బి.కెమల్లికార్జున (కృష్ణా), ఈశ్వరరావు (ప్రకాశం) 40 ఏళ్ల పైన కేవీ నాగులు(కృష్ణ), ఎంవీ నరసయ్య(కృష్ణా), షేక్ సజీత్ (నెల్లూరు), 35 ఏళ్ల పైన ప్రభాకర్ (ప్రకాశం), 30 ఏళ్ల పైన వెంకటరావు (ప్రకాశం), 1500 మీటర్ల పరుగుపందెం 30 ఏళ్ల పైన డి.గోవిందరావు(విజయనగరం), బి.రామారావు (విజయనగరం), 40 ఏళ్ల పైన రామరాజు (తూర్పుగోదావరి), ఎస్ రవిబాబు (కృష్ణ), ఈ సుధాకర్ (నెల్లూరు), 45 ఏళ్ల పైన ఎస్ వెంకటేశ్వరరావు (విజయనగరం), సూర్యనారాయణ (విజయనగరం), 50 ఏళ్ల పైన పైన కె.జనార్దనరావు (విజయనగరం), జి.వెంకటరావు (నెల్లూరు), రామిరెడ్డి (ప్రకాశం), 55 ఏళ్ల పైన వెంకటరావు (తూర్పుగోదావరి), ప్రకాష్ (విశాఖపట్నం), 65 ఏళ్ల పైన మోహన్‌కుమార్ 400 మీటర్లు (కృష్ణా), 400 మీటర్లు 80 ఏళ్ల పైన ఎంఎస్ఎన్ మూర్తి (విజయనగరం), 70 ఏళ్ల పైన ఈ భాస్కర్‌రెడ్డి (నెల్లూరు) 60 ఏళ్ల పైన రాజు (నెల్లూరు), సంధ్యారావు (విశాఖపట్నం), 55 ఏళ్ల పైన నాగబాబు (తూర్పుగోదావరి), వెంకటరావు (తూర్పుగోదావరి), చౌదరి (కృష్ణా) 50 ఏళ్ల పైన అప్పలస్వామి (కృష్ణ), పైడిరాజు (విజయనగరం), మస్తానయ్య (నెల్లూరు) విజయం సాధించారు. హామర్ త్రో విభాగంలో మహిళలు కె.సీతామహాలక్ష్మి (విశాఖపట్నం), ఎస్ అంజమ్మ (నెల్లూరు), పురుషుల విభాగంలో కె.జీవన్‌కుమార్ (ప్రకాశం), మురళి (ప్రకాశం), డీటీ శశికుమార్ (విశాఖపట్నం), షాట్‌పుట్‌విభాగంలో జీవన్‌కుమార్ (ప్రకాశం), మురళి (ప్రకాశం), జావెలిన్ త్రోలో జీవన్‌కుమార్ (ప్రకాశం), మురళి (ప్రకాశం)లు విజయం సాధించారు. ఓవరాల్ ఛాంపియన్‌గా నెల్లూరు, వ్యక్తిగత ఛాంపియన్‌గా జీవన్‌కుమార్ (ప్రకాశం)లు ఎంపికయ్యారు.



హేమర్‌త్రోలో పతకాలు సాధించిన విజేతలు



వ్యక్తిగత చాంపియన్ జీవన్‌కుమార్